100 రోజుల ప్రగతిపై నివేదికలు

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరంకోట

వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై కచ్చితమైన నివేదికలను రెండు రోజుల్లోగా సిద్ధం చేయాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్.. వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కార్యాచరణ ప్రణాళిక ప్రగతిపై కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సమీక్షించారు. ఆయా శాఖల ప్రగతిని పరిశీలించారు. వ్యవసాయం, ఉద్యాన, గృహనిర్మాణం, బిందు తుంపర సేద్యం తదితర శాఖల ప్రగతిపై ఆరా తీశారు. బుధవారానికి సమగ్ర నివేదికలను అందజేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, సిపిఒ పి.బాలాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అబ్బురా ఏమి విజన్.. జిల్లాపై ఎంత ప్రేమ... ఎంత తీపి మాటలు... ఎంత బడ్జెట్... ఒక్కసారి 40 రోజుల కోసం సరిగ్గా సెప్టెంబర్ నెలాఖరులో మన జిల్లా అభివృద్ధికి విజన్-2047 ప్రకారం, నేటి బడ్జెట్ కేటాయింపులు చూసుకుంటే అర్థమౌతుంది. నేరుస్తు రూ.1.46 లక్షల తలసరి ఆదాయం కేవలం 23 సంవత్సరాల్లో రూ.3.23 లక్షలకు తీసుకెళ్తామని, అందుకు తగ్గట్టు వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాలను అభివృద్ధి చేస్తామని కూటమి ప్రభుత్వం నమ్మబలికింది. ప్రణాళిక వరకు బాగానే ఉన్నా అందుకు తగ్గట్టు బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. మొదటి సంవత్సర బడ్జెట్‌లోనే ప్రభుత్వ మాటలకు, చేతలకు పొంతన లేదని బయట పడిపోయింది.

అర్ధాంతరంగా నిలిచిపోయిన రామతీర్థ సాగర్ ప్రాజెక్టు

అబ్బబ్బా ఎంత బడ్జెట్టో

- అభివృద్ధికి ఘనమైన లక్ష్యాలు • కంటితుడుపుగా కేటాయింపు
- రూ.1098 కోట్లు అడిగితే.. ఇచ్చింది రూ.64 కోట్లు
- ఇతర సాగునీటి వనరులకూ అంతే సంగతులు
- జిల్లా వాసులను నిరాశ పర్చిన బడ్జెట్ సమావేశం

జిల్లాకు అన్యాయం చేశారు

రాష్ట్ర బడ్జెట్‌లో విజయనగరం జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారు. జిల్లా అభివృద్ధికి, పరిశ్రమలు, వ్యవసాయ రంగం, ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా మోసం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారు తున్నాయి తప్ప జిల్లా అభివృద్ధికి నిధులు ఇవ్వట్లేదు. బడ్జెట్ కేవలం అంకెల గారడీ తప్ప ప్రయోజనం లేదు. గత బడ్జెట్‌లో కూడా కేటాయింపులు చూపించారు తప్ప ఖర్చు చేయలేదు. జిల్లాతోపాటు వెనుకబడిన ఉత్తరాంధ్రకు బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం చేశారు.

- తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి

రామతీర్థసాగర్

బడ్జెట్	ప్రతిపాదన	కేటాయింపులు	విడుదల
2021-22	201 కోట్లు	21.83 కోట్లు	28.49 కోట్లు
2022-23	124.50 కోట్లు	43.41 కోట్లు	2.76 కోట్లు
2023-24	150 కోట్లు	60.62 కోట్లు	19.89 కోట్లు
2024-25	533.18 కోట్లు	28 కోట్లు	??

తోటపల్లి

బడ్జెట్	ప్రతిపాదన	కేటాయింపులు	విడుదల
2019-20	156 కోట్లు	19.19 కోట్లు	13.65 కోట్లు
2020-21	225.57 కోట్లు	56.99 కోట్లు	37.28 కోట్లు
2021-22	199.70 కోట్లు	17.25 కోట్లు	1.35 కోట్లు
2022-23	126.61 కోట్లు	24.35 కోట్లు	4.32 కోట్లు
2023-24	80.84 కోట్లు	84.20 కోట్లు	6.64 కోట్లు
2024-25	565.58 కోట్లు	36.85 కోట్లు	??

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అసెంబ్లీ సమావేశాల్లో తొలిరోజు సోమవారం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇందులో జిల్లా అభివృద్ధికి కేటాయించిన నిధులు కంటితుడుపుగానే ఉన్నాయి. విజన్ -2047 పేరిట వ్యవసాయంతో పాటు పారిశ్రామిక, సేవా రంగాలను అభివృద్ధి చేసి, అభివృద్ధి చెందిన జిల్లాల సరసన చేరుస్తామంటూ సెప్టెంబర్ 30న జరిగిన సమావేశంలో ప్రభుత్వ అధికారులతో చెప్పించిన సంగతి తెలిసిందే. ఇందులో ఏ రంగం అభివృద్ధి చెందాలన్నా నీటి వనరులు అత్యంత కీలకం. నీరుంటే పంటలు పండుతాయి. నీరు లేకుండా పరిశ్రమల స్థాపన, మనుగడ కూడా అసాధ్యం. చివరికి సేవా రంగంలో రోడ్లు వేయాలన్నా, భవనాలు నిర్మించాలన్నా, హోటళ్లు, తదితర వ్యాపార లావాదేవీలు సాగించాలన్నా నీరే కీలకం. ఇంతటి ప్రాధాన్యతగల నీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిందెంత? అంటే ఆవగింజలో 60వ వాటానే. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రధానమైన జలవనరులు తోటపల్లి, రామతీర్థసాగర్, జంఝావతి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వీటితోపాటు ఆండ్ర, పెద్దగెడ్డ, తాటిపూడి, వెంగళరాయసాగర్, వట్టిగెడ్డ, పెదంకలాం తదితర జలాశయాలు ఉన్నాయి. కానీ, బడ్జెట్ కేటాయింపుల్లో తోటపల్లి, రామతీర్థసాగర్, సుజల స్రవంతికి తప్ప మిగిలిన వాటి ప్రస్తావన లేదు.

ముఖ్యంగా 64 వేల ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరిస్తూనే, కుడి కాలువ ద్వారా అదనంగా 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు ఇప్పటికీ సగం విస్తీర్ణానికే నీరందిస్తోంది. ఏటా అరకొర నిధులు కేటాయించి, వాటిని కూడా ఖర్చు చేయకపోవడమే కారణం. ఈ ఏడాది కాలువల నిర్మాణాలు, ఇతర పనుల కోసం రూ.279.96 కోట్లు, భూసేకరణకు రూ.55.81 కోట్లు, నష్టపరిహారం, పునరావాసం కోసం రూ.119.10 కోట్లు, సిఎడిడబ్ల్యుఎంకు రూ.110.06 కోట్లు, నిర్వహణకు రూ.65 లక్షలు.. చొప్పున మొత్తం రూ.565.58 కోట్లు అవసరం కానున్నట్టు తోటపల్లి ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపిస్తే, తాజా బడ్జెట్‌లో కేవలం రూ.36.85 కోట్లు మాత్రమే కేటాయించింది. ఇందులో పనులకు రూ.25.84 కోట్లు, భూసేకరణకు రూ.6.21 కోట్లు, నష్టపరిహారం, పునరావాసం, సిఎడిడబ్ల్యుఎంలకు రూ.4.80 కోట్లు కేటాయించినట్టు బడ్జెట్ పత్రాల్లో పేర్కొంది.

రామతీర్థసాగర్ పనులు గడిచిన కొన్ని దశాబ్దాలుగా ముందుకు సాగడం లేదు. 24 వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరానికి తాగునీరు, ఇటీవల భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు నీటి సదుపాయం కోసం లక్ష్యంగా తలపెట్టిన ఈ ప్రాజెక్టుకు రూ.533.18 కోట్లు కేటాయించాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. కేటాయించింది కేవలం రూ.28 కోట్లు మాత్రమే. ఇది ఏ మూలకూ సరిపోని పరిస్థితి నెలకొంది.

ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేసేందుకు తలపెట్టిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి కేటాయించిన నిధులు [illegible] రూ.కోట్లకు మించకపోవడం గమనార్హం. రాష్ట్రంలో జల వనరులకు రూ.16,743 కోట్లు కేటాయించగా, అందులో మన జిల్లా వాటా ఇచ్చింది రూ.64 కోట్లు కావడం ప్రభుత్వ వివక్షతకు అద్దం పడుతోంది. నీటి వనరులకే నిధులు కేటాయించని ప్రభుత్వం జిల్లా ప్రగతిని పరుగులు పెట్టిస్తుందంటే నమ్మేదెట్టా? అంటూ జనం చర్చించుకుంటున్నారు.

ఉత్తరాంధ్రకు మళ్లీ అన్యాయం

రాష్ట్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచింది. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పోరాడుతున్నా, విశాఖపట్నం స్టీల్ ప్లాంటును రక్షిస్తామనే కనీస ప్రస్తావన కూడా బడ్జెట్ ప్రసంగంలో లేదు. ఉత్తరాంధ్ర నీటి అవసరాలను తీర్చే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ప్రస్తావనే లేదు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న జంఝావతి, తారకరామ తీర్థ సాగర్ వంటి ప్రాజెక్టులను సరిగా పట్టించుకోలేదు. గిరిజన ప్రాంతంలో జిఒ 3 పునరుద్ధరణ ప్రస్తావన లేకపోవడం గిరిజన యువత ఉపాధిపై తీవ్రంగా ఉంటుంది. గిరిజన కార్పొరేషన్ బలోపేతం చేయాల్సిన అవసరం ఉండగా, కనీసం ఆ ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదు.

- ఎం.శ్రీనివాస, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి

అభివృద్ధి, సంక్షేమం మేళవింపు

అభివృద్ధి, సంక్షేమం మేళవింపునకు రాష్ట్ర బడ్జెట్ ప్రతిబింబిస్తోంది. సంపద సృష్టించాలన్న సిఎం ఆలోచనలను ఆచరణలో పెట్టేలా ఆర్థిక మంత్రి కేశవ్ అద్భుతమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. తల్లికి వందనం, ఉచిత బస్సు పథకానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించడం సంతోషం. గత పాలనలో మోసపోయిన అన్ని వర్గాలకు, అన్ని రంగాలకు న్యాయం చేసేలా కేటాయింపులు చేసింది.

- గురాన అయ్యలు, జనసేన నాయకులు

సూపర్ సిక్స్ అమలు ఎక్కడ?

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు ఎక్కడ? బడ్జెట్‌లో వాటికి కేటాయింపులు లేవు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ.1500 ఇస్తామన్న వాగ్దానం, రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం హామీ ఏమయ్యాయి? కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టడానికి మోసపూరితమైన హామీలిచ్చింది.

- ఒమ్మి రమణ, సిపిఐ జిల్లా కార్యదర్శి

ఆమోదయోగ్యమైన బడ్జెట్

అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని లోతుగా ఆలోచించి, అధ్యయనం చేసి బడ్జెట్ తెచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేరే దిశగా బడ్జెట్ ఉంది. రోడ్లు, భవనాలకు 9,500 కోట్ల రూపాయలు కేటాయించింది. రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించి, ప్రత్యేకమైన కేటాయింపులు చేయడం ఆనందం. గత వైసిపి ప్రభుత్వం రోడ్లను నిర్వీర్యం చేసింది.

- కిమిడి నాగార్జున, టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు

జిల్లాకు ఎన్నికల పరిశీలకుల రాక

ఉప ఎన్నిక ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరంకోట

శాసనమండలి స్థానిక సంస్థల నియోజకవర్గ ఉపఎన్నికకు పరిశీలకులుగా నియమితులైన రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ సోమవారం జిల్లాలో పర్యటించారు. ఉదయం జిల్లా పరిషత్ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఎస్పి వకుల్ జిందాల్, జెసి సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ కీర్తి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్, జెసి, తదితరులు ఎన్నికల పరిశీలకులతో సమావేశమై, శాసనమండలి ఉప ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎంసిసి బృందాల ఏర్పాటు తదితర అంశాలను తెలిపారు. జిల్లాకు గతంలో కలెక్టర్‌గా పనిచేసిన నాయక్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి గురించి కూడా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం, ఇతర ప్రాజెక్టులు, తదితర అంశాలపై కలెక్టర్ ఆయనకు వివరించారు. అనంతరం కలెక్టరేట్‌కు ఎన్నికల పరిశీలకులు నాయక్ చేరుకున్నారు. రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌కి వెళ్లి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఉప ఎన్నికకు దాఖలైన నామినేషన్ వివరాలను జెసి కలెక్టర్ ఆయనకు వివరించారు.

బహుళార్థ పశువైద్య శాలను పరిశీలిస్తున్న కార్యదర్శి ఎంఎం నాయక్

అనంతరం నగరంలోని బహుళార్థ పశువైద్య శాలను, పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని సందర్శించి వాటి ద్వారా అందుతున్న సేవలను తెలుసుకున్నారు. పశు సంవర్ధక శాఖ జెడి. కార్యాలయాన్ని సందర్శించి జిల్లాలో పశువుల టీకా కార్యక్రమం, గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ మందు వేసే కార్యక్రమంపై ఆరా తీశారు. స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాల సాధనకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అమలు తీరును సమీక్షించారు.

డెంకాడ : మండలంలోని రఘుమండ పశువైద్య కేంద్రాన్ని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ ఆకస్మికంగా తనిఖీచేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. పశుసంవర్ధక శాఖ జెడి వైవి రమణ, పశువైద్యాధికారి ఎన్.సాగర్ పాల్గొన్నారు.

ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం

కలెక్టర్ అంబేద్కర్ • ఘనంగా మైనారిటీల సంక్షేమ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతికి చేసిన సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ కొనియాడారు. దేశ ప్రథమ విద్యా శాఖా మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా, జాతీయ విద్యా, మైనారిటీల సంక్షేమ దినోత్సవాలను కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుని ఆశయాలు, బోధనలు జాతికి సదా అనుసరణీయమన్నారు. వాటిని సాధించడమే ఆజాద్‌కు నిజమైన నివాళి అన్నారు. డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఆర్.ఎస్.జాన్, జిల్లా ఖజానా అధికారి కుమార్, మైనారిటీ సోషల్ వర్కర్ షేక్ అబ్దుల్ కరీమ్ వాజిద్, వివిధ మతాల పెద్దలు, సంఘాల ప్రతినిధులు వై.ప్రభాకర్, మహ్మద్ రఫీ, జ్యోతి బచావత్, డాక్టర్ బాబ్జీ జస్వీర్ సింగ్, టి.శామ్యూల్ రాజ్, ఆర్ఇ రాణి, బిఎంరాజు, ఎం.ఎ.నాయుడు, మహ్మద్ హబీబ్, మహమ్మద్ అమానుల్లా, ఫాతిమా జెహ్రా తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు, సంఘ ప్రతినిధులను జిల్లా కలెక్టర్ సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, ఉన్నతాధికారులు

గొప్ప పోరాటయోధుడు ఆజాద్

విజయనగరం కోట : గొప్ప పోరాటయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని డిసిసి అధ్యక్షులు ఎం.విద్యాసాగర్ అన్నారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మైనారిటీ విభాగం మాజీ వైస్ ఛైర్మన్ ఎమ్‌డి హుస్సేన్ షరీఫ్, అబ్దుల్ కరీం, అబ్దుల్ రెహమాన్, షేక్ ఖలీల్, షేక్ సమీర్, షేక్ మక్బుల్ పాల్గొన్నారు.

నెలాఖరులోగా పిఎసిఎస్‌ల కంప్యూటీకరణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈ నెలాఖరులోగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటీకరణ పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. డిసెంబరు నుంచి లావాదేవీలన్నీ కంప్యూటర్ ద్వారానే జరుగుతాయని తెలిపారు. పిఎసిఎస్‌ల సిఇఒలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, బ్రాంచ్ మేనేజర్లు, పర్సన్ ఇన్‌ఛార్జులు, డిసిసిబి బ్రాంచ్ మేనేజర్లతో కలెక్టరేట్‌లో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. కంప్యూటరైజేషన్, అనలైజర్, పార్కింగ్ అకౌంట్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పిఎసిఎస్‌ల కంప్యూటరీకరణను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే, డిసిసిబి మేనేజర్లు, సిఇఒను సంప్రదించాలని సూచించారు. పిఎసిఎస్‌లలో సుమారు 2,42,000 మంది సభ్యులుగా ఉన్నప్పటికీ, చురుగ్గా ఉన్న సభ్యుల సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు. చురుగ్గా లేని సభ్యులను సర్వజన సభలో తీర్మానం పెట్టి తొలగించాలని సూచించారు. ప్రతిఒక్కరి నుంచి ఆధార్ నంబరు సేకరించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి పి.రమేష్, డిసిసిబి సిఇఒ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విజయనగరం టౌన్ : జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని సంఘం గౌరవ అధ్యక్షులు ఎస్ఎస్ఎస్ఎస్ విఆర్ఎం రాజు, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షులు కె.దయానంద్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ కోరారు. సోమవారం సంఘం కార్యాలయంలో వారోత్సవాల కార్యక్రమాల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా ర్యాలీలు, గ్రంథాలయాలకు పుస్తక వితరణ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, నూతన పుస్తక ఆవిష్కరణ, పుస్తక ప్రదర్శన, జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పాత్రికేయులకు సత్కారం, మహిళా రచయితలకు సత్కారం, గ్రంథాలయ ఉద్యమ కార్యకర్త రెడ్డి రమణ స్మారక పురస్కారంతోపాటు పాఠశాలలు, కళాశాలలలో గ్రంథాలయ చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు, విశ్రాంత గ్రంథాలయ సంస్థ అధికారి బి.రామభద్రరాజు, గమ్యం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు వేమలి చైతన్య బాబు, వాకర్స్ శ్రీరామూర్తి, జనార్దనరావు, కందాల సాయిబాబా, సాయిరెడ్డి పాల్గొన్నారు.

బిసి హాస్టల్లో పరిస్థితులపై జెసి ఆరా

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలోని మహారాణిపేట బి.సి.బాలుర వసతిగృహాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ఈ హాస్టల్‌లో ఉంటున్న ఏడో తరగతి విద్యార్థి కొణతాల శ్యామలరావు అస్వస్థతకు గురై మరణించిన నేపథ్యంలో అక్కడి పరిస్థితులను తెలుసుకొనేందుకు జెసి తనిఖీ చేశారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారికి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నదీ, లేనిదీ తెలుసుకున్నారు. అక్కడి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. వంటగదిని పరిశీలించి పరిశుభ్ర వాతావరణంలో ఆహారం తయారు చేస్తున్నదీ, లేనిదీ ఆరాతీశారు. హాస్టల్ సంక్షేమ అధికారి జానకిరావు, వంటవారితో మాట్లాడి విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో నాణ్యత పాటిస్తున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని పరిశుభ్ర వాతావరణంలో వండించి ఇవ్వాలని జెసి ఈ సందర్భంగా హాస్టల్ సంక్షేమాధికారిని ఆదేశించారు. మెనూ ప్రకారం ఆహారం అందించకపోతే తమకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ పర్యటనలో బిసి సంక్షేమాధికారి పెంటోజీరావు కూడా ఉన్నారు.

హాస్టల్లో వంటగదిని పరిశీలిస్తున్న జెసి సేతు మాధవన్

ఇంటి వద్దే కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

విజయనగరంకోట : ఈ నెల 14 నుంచి ఇంటింటికీ వెళ్లి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యమని స్పష్టంచేశారు. వీటికి సంబంధించిన పోస్టర్లను కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ఆవిష్కరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వార కేన్సర్లతోపాటు, బిపి, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో జెసి ఎస్.సేతుమాధవన్, డిఎంహెచ్ఒ డాక్టర్ రాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

13 కిలోల గంజాయి స్వాధీనం

విజయనగరం కోట : విజయనగరం రైల్వేస్టేషన్‌లో 13 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లో ఫ్లాట్‌ఫాం తనిఖీ చేస్తున్న సమయంలో ఉత్తరప్రదేశ్‌కి చెందిన వికాస్ వర్మ, సతీష్‌కుమార్ పాల్ అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి రూ.65 వేలు విలువైన 13 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిఆర్‌పి ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

జెఎన్‌టియులో గ్రీన్‌క్లబ్

విజయనగరంటౌన్: జెఎన్‌టియు-జివిని గ్రీన్ క్యాంపస్‌గా మార్చడానికి గ్రీన్‌క్లబ్‌ను సోమవారం ప్రారంభించారు. అందులో భాగంగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని యూనివర్శిటీ పరిధిలోని గెస్ట్ హౌస్ ముందు భాగంలో జెఎన్‌టియు ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జి.జయసుమ ప్రారంభించారు. కార్యక్రమంలో అనిట్స్ సిఇసి ప్రొఫెసర్ ఎన్.పద్మజ, డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ ప్రొఫెసర్ కె.బాబు, ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ వి.మణికుమార్, పిఒలు బి.ధర్మారావు, ఎ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు వేగవంతం

ప్రజాశక్తి-విజయనగరం కోట

అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పి వకుల్ జిందాల్.. డిఎస్‌పిలను ఆదేశించారు. స్థానిక ఎస్పి కార్యాలయంలో సోమవారం డిఎస్‌పి స్థాయి అధికారులతో సమీక్షించారు. విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజన్ల పరిధిలో నమోదై, దర్యాప్తులో ఉన్న అట్రాసిటీ కేసులను ఎస్పి సమీక్షించారు. ఆయా కేసుల్లో ఇంత వరకు జరిగిన దర్యాప్తు తీరును పరిశీలించారు. కేసుల దర్యాప్తును 60 రోజుల్లో పూర్తి చేసి, నిందితులపై అభియోగ పత్రాలను న్యాయ స్థానాల్లో దాఖలు చేయాలని ఎస్పి ఆదేశించారు. సమావేశంలో బొబ్బిలి డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు, డిటిసి డిఎస్‌పి ఎం.వీరకుమార్, డిసిఆర్‌బి ఇన్‌ఛార్జి సిఐ ఆర్.వి.ఆర్.కె చౌదరి, ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పి వకుల్ జిందాల్

ప్రకృతి వ్యవసాయ ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరంకోట

కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తిలకించారు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలను నిర్వహిస్తున్న తెలిసిందే. ఈ వారం ఏర్పాటు చేసిన ప్రదర్శనను కలెక్టర్ తిలకించి, ఉత్పత్తుల గురించి ఆరా తీశారు. కూరగాయల విత్తనాలను కలెక్టర్ కొనుగోలు చేశారు. ఆ ఉత్పత్తుల గురించి జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, ప్రకృతి వ్యవసాయం ఎడి ఆనందరావు కలెక్టర్‌కు వివరించారు.

అసంబద్ధ సర్దుబాటు సరిచేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, వాస్తవిక అవసరాన్ని బట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చెయ్యాలని పిఆర్‌టియు నాయకులు బి.శివప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో 1 నుండి 5 తరగతులకు 18 సబ్జెక్టులను బోధించడంతోపాటు పరీక్షల నిర్వహణ, నివేదికలు పంపడం, ఎండిఎం, యాప్స్, ఆన్‌లైన్ పనులు చెయ్యలేక సతమతం అవుతున్నారని తెలిపారు. డిఇఒలు పనిసర్దుబాటుకు స్వేచ్ఛ ఇస్తే... అవసరాన్ని గుర్తించి ప్రక్రియ పూర్తిచేస్తారని చెప్పారు. 10 మంది దాటిన సింగిల్ టీచర్ స్కూల్‌కి అదనంగా టీచర్‌ను కానీ, ఎంటిఎస్‌ను కానీ కేటాయించాలని కోరారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ జాప్యమెందుకు? : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కూటమి ప్రభుత్వం వివిధ రకాల కారణాలతో డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలలో జాప్యం చేయడం తగదని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్.హరీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఎన్నికలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి, టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో నిరుద్యోగులు విసిగివేసారి మార్పు కోసం గంపగుత్తగా కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించడంలో కీలక పాత్ర వహించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిఎం చంద్రబాబు డిఎస్‌సిపై మొదటి సంతకం చేసి, ఐదు నెలలు గడిచినా నోటిఫికేషన్ రాలేదని చెప్పారు. డిఎస్‌సి నోటిఫికేషన్ అదిగో.. ఇదిగో.. అంటూ ఉరిస్తున్నారు తప్ప విడుదల చేయడం లేదని, దీంతో నిరుద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోందని తెలిపారు.

15న ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 15న విజయనగరంలో నిర్వహించే ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలని పిడిఎస్ఒ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సోమేష్, బి.రాకేష్ కోరారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల వద్ద సదస్సు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

మహిళ ప్రాణాలకు తప్పిన ముప్ప

విజయనగరంకోట : నగరంలోని గూడ్స్‌షెడ్ వద్దనున్న శివాలయంలో సోమవారం అపశ్రుతి చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ స్పందించడంతో ఓ మహిళ ప్రాణాలకు ముప్పు తప్పింది. ఇంతకీ ఏం జరిగిందంటే..?

కార్తీక సోమవారం కావడంతో నగరంలోని గూడ్స్‌షెడ్ వద్దనున్న శివాలయానికి భారీగా జనం తరలివచ్చారు. ఆ సమయంలో ఓ మహిళ చీరకొంగుకు ప్రమాదవశాత్తూ దీపం అంటుకుంది. క్షణాల్లో మంటలు చెలరేగి ఆమె చీర పూర్తిగా కాలిపోవడంతో భయంతో ఆమె, అక్కడ ఉన్న యాత్రికులు పరిగెత్తడంతో ఒక్కసారిగా గందరగోళ వాతావరణం ఏర్పడింది. శివాలయం వద్ద విధుల్లో ఉన్న వన్‌టౌన్ కానిస్టేబుల్ ఎన్.మణికంం.. చొరవతో ముందుకెళ్లి, మంటలను చేతులతో ఆర్పివేశారు. దగ్గరలో స్వాముల వద్ద ఉన్న తువ్వాలును మహిళకు ఇవ్వడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమయానుకూలంగా స్పందించి, అగ్ని ప్రమాదానికి గురైన మహిళను రక్షించిన కానిస్టేబుల్ ఎస్.మణికంఠను ఎస్పి వకుల్ జిందల్ తన కార్యాలయానికి పిలిపించి, అభినందించారు. ప్రశంసా పత్రం అందజేశారు.

డిసెంబర్ 15కి అర్బన్ రీసర్వే పూర్తి

విజయనగరం టౌన్ : నగరంలో అర్బన్ రీసర్వే డిసెంబర్ 15 నాటికల్లా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారని కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. సోమవారం ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ పరిశీలన చేపట్టారు. ఈ విషయమై అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, సర్వేయర్ సింహాచలం.. సచివాలయ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. నగరంలో ఉన్న ఆస్తుల వివరాలు, భవనాలు, వాటి ఇంటి పన్నులు వంటి పూర్తి వివరాలు పొందుపరచాలని చెప్పారు.

అద్దె చెల్లించని షాపులు సీజ్

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ ఆధీనంలోని ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్సులో దుకాణాల అద్దెలను చెల్లించని షాపులను సోమవారం రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. దీర్ఘకాల అద్దె బకాయిలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టంచేశారు. మొండి బకాయిదారులు ఉండడంతో వాటికి తాళాలు వేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సాయిప్రసాద్, చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన కర్రోతు

భోగాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలో ఆయనను కలిసి నియోజకవర్గంలోని పలు అంశాలపై మాట్లాడారు. ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. అనంతరం వాటిని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పాఠశాలకు క్రీడా పరికరాలు పంపిణీ

పరికరాలను హెచ్ఎంకు అందిస్తున్న ప్రతినిధులు

మెరక ముడిదాం: విజిల్ మైండ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సోమవారం మెరక ముడిదాం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.50వేలు విలువగల క్రీడా పరికరాలు, 20 జతల యూనిఫాంలను అందించారు. ఈ సందర్భంగా సంస్థ సిఇఒ గాయత్రి వెంకటేషన్, ఎండి సంఘం రెడ్డి భానుమూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో గల విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంలో కూడా రాణించాలన్న ఉద్దేశంతో ఈ క్రీడా పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ క్రీడా పరికరాలను సంస్థ ఎండి తండ్రి సంఘం రెడ్డి సన్యాసి నాయుడు చేతులు మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోట్ల ఎల్లంనాయుడుకు అందించారు.

సోంపురంలో విద్యా దినోత్సవ వేడుకలు

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యా దినోత్సవం వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బిపిఎ. రాజు తెలిపారు. భారత ప్రథమ విద్యా శాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ జన్మ దినాన్ని పురస్కరించుకొని ఏటా జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 'విద్యా ఆవశ్యకత' అనే అంశం పై వక్తృత్వ పోటీ నిర్వహించారు. ఆయా తరగతి ఉపాధ్యాయుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ

కొత్తవలస: శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా వికలాంగులకు సోమవారం కృత్రిమ అవయవాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ భూపతిరాజు పండేటి, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జి హాజరై పంపిణీ చేశారు. ముందుగా ట్రస్ట్‌ను, శ్రీ గురుదేవ హాస్పిటల్‌ను, నూతనంగా నిర్మిస్తున్న డాక్టర్ విజయశ్రీ మెమోరియల్ కేన్సర్ హాస్పిటల్‌ను సందర్శించి చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో 50 మందికి పైగా కృత్రిమ అవయవాలు, 70 మందికి పైగా అంధులకు పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, వైస్ చైర్మన్ డాక్టర్ వి.ఫణీంద్ర, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ కుమార్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఖాతాదారుల సహకారంతో మరిన్ని సేవలు

మెంటాడ: ఖాతాదారుల సహకారంతో మరిన్ని సేవలు అందిస్తామని ఖాతాదారుల అభివృద్ధి తమ బ్యాంకు లక్ష్యమని యూనియన్ బ్యాంకు మెంటాడ శాఖ మేనేజర్ వి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఈ శాఖ పదవ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 13కోట్ల రూపాయలు డిపాజిట్లుగా సేకరించినట్టు తెలిపారు. 43 కోట్ల రూపాయలు రుణాలు అందజేసామన్నారు. మొత్తంగా, 55 కోట్ల రూపాయలు టర్నోవర్ సాధించామని, ముమ్మందు ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. రుణ గ్రహీతలు రికవరీ విషయంలో మరింత సహకరించాలని కోరారు. దీనివల్ల, మరింత మందికి రుణ సౌకర్యం కల్పించేందుకు వీలవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఈశ్వరరావు, సోనాలి నాయక్, దేవత్ రాజు, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు న్యాయం చేయండి

తెర్లాం: మండలంలో కుసుమురు గ్రామానికి చెందిన మరియమ్మ పెరుగల డ్వాక్రా గ్రూప్ సభ్యులకు తెలియకుండా దొంగ సంతకాలతో రూ.7లక్షలు లోను తీసుకొని ఆ మొత్తాన్ని గ్రూపులో వున్నా కొంత మందికి ఇచ్చి మిగతా వారిని మోసం చేశారని ఆ గ్రామానికి చెందిన జనసేన నాయకులు ఆ పార్టీ మండల అధ్యక్షులు మరడాన రవి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందించి వెలుగు ఎపిఎం టి. రాముతో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలనీ, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు.

సేవలకు గుర్తింపు

బొబ్బిలి: హుధా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సేవలకు మంచి గుర్తింపు లభించింది. పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఉన్న పేద ముస్లింల సంక్షేమానికి హుధా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. రంజాన్ సందర్భంగా పేద ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ, పేద ముస్లింలు వైద్యానికి, విద్యకు ఆర్థిక సహకారం చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టడంతో బెస్ట్ సర్వీసెస్ అవార్డును హుధా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రకటించారు. బెస్ట్ సర్వీసెస్ అవార్డును అధ్యక్షులు రఫీకు కలెక్టర్ అంబేద్కర్ అందజేశారు. అవార్డు మరింత బాధ్యతలు పెంచిందని రఫీ అన్నారు.

ఆశా కార్యకర్తలకు శిక్షణ

గుర్ల: జాతీయ్య ఆరోగ్య మిషన్‌లో భాగంగా ఆయుష్ సిస్టమ్‌పై ఆశ కార్యకర్తలకు సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలో గల ఆశా కార్యకర్తలకు ఆయుష్ సిస్టం, మధుమేహం వ్యాధి పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక హోమియోపతి డాక్టర్ వెంకట మధు మాట్లాడుతూ ఆయుష్ ద్వారా ఆరోగ్య పరిరక్షణ చేసుకోవచ్చు అని అన్నారు. ఆశా కార్యకర్తల గ్రామాలలో ప్రజలు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

డెంకాడ: మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని పెదతాడివాడలో సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా టి.విశ్వ నాయుడు, మండల అధ్యక్షుడిగా ఎస్ చంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా కె.శోభన్‌బాబు, కోశాధికారిగా కిరణ్ కుమార్‌లను మండల ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

అలజంగిలో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- బొబ్బిలి

మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన రెడ్డి జగన్నాధం నాయుడు(49) సోమవారం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎఎస్ఐ సన్యాసిరావు వివరాలు మేరకు.. జగన్నాధంనాయుడు రెండేళ్ల క్రితం నుంచి భార్య వాణికు దూరంగా ఉంటున్నాడు. ఇంటిలో ఒక్కడే ఉండడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. భార్య వాణి ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ సన్యాసిరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముకుందపురంలో గడ్డివాముల దగ్ధం

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలోని ముకుందపురం గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాముల దగ్ధమయ్యాయి. అగ్నిమాపక అధికారి జనార్దన్ రావు ఇచ్చిన సమాచారం మేరకు..గ్రామంలోని గడే సంతోష్ కుమార్‌కు చెందిన సుమారు రెండు ఎకరాల వరిగడ్డివాములు, రెండు పశువుల శాలలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్తులు రాజాం అగ్నిమాపక కేంద్రానికి సమాచార ఇవ్వడంతో హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. కార్తీకమాస దీపపు ఒత్తులను గడ్డివాములపై పడేయడంతో ఈ ప్రమాదం సంభవించిందని అంచనా వేస్తున్నారు.

చీరకు నిప్పంటుకొని వృద్ధురాలు మృతి

దత్తిరాజేరు : మండలంలో పెదమానాపురం గ్రామానికి చెందిన సారికి సింహాచలం (65) సోమవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకుని మృతి చెందింది. పెద మానాపురం పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. మృతురాలు చుట్ట కాల్చే అలవాటు ఉండడంతో ఆదివారం రాత్రి చుట్ట కాల్చి అది ఆర్పకుండా పక్కనే పెట్టుకుంది. దీంతో ఆమె కట్టుకున్న బట్టలకు నిప్పు అంటుకుని నిద్రిస్తున్న సమయంలో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పెదమానాపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

క్రీడలకు ప్రాధాన్యతనిచ్చేందుకు త్వరలో వర్క్‌షాప్

- జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యనాయుడు
- ఘనంగా ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు
- విజేతలుగా శ్రీకాకుళం, కడప
- మూడోస్థానంలో విజయనగరం

ప్రజాశక్తి - భోగాపురం

జిల్లాలో క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు త్వరలో వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యనాయుడు అన్నారు. రాష్ట్రస్థాయి 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 వాలీబాల్ పోటీలు భోగాపురం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గత మూడు రోజులుగా జరుగుతూ సోమవారం ముగిశాయి. ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులతో ఈ వర్క్‌షాపు నిర్వహించి క్రీడలను మరింత ప్రోత్సహిస్తామన్నారు. క్రీడలు చదువులో భాగమని, చదువుకు ప్రాధాన్యతనిస్తూ క్రీడల్లో రాణించాలన్నారు. జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడల్లో ప్రతి ఒక్కరూ రాణించాలన్నారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు ఉద్యోగాల్లో 2శాతం ఉన్న కోటాను మూడు శాతానికి పెంచిందన్నారు. క్రీడలపై దృష్టి సారిస్తే భవిష్యత్తు బాగుంటుందన్నారు. మీలో ఒక్కరైనా ఒలింపిక్ వెళ్లి దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. 2027లో నేషనల్ గేమ్స్‌ను ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నందున అందులో పాల్గొనేందుకు పోటీ పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి

విజయనగరం జట్టుకు షీల్డ్ ఇస్తున్న డిఇఒ మాణిక్యంనాయుడు

టి.వి భగవాన్‌దాస్, డిప్యూటీ డిఇఒ, ఎంఇఒ చంద్రమౌళి, ఎస్.జి.ఎఫ్ కార్యదర్శి కె.కృష్ణంరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.వి.ఎఎన్ రాజు, పి.ఇ.టీలు నాగన్న, రమణతో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేత

ఈ పోటీల్లో బాలుర విభాగంలో విశాఖపట్నం జట్టుపై శ్రీకాకుళం జట్టు గెలిచి విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో గుంటూరు జట్టుపై కడప జట్టు గెలిచి విజేతగా నిలిచింది. ఇక మూడో స్థానంలో వెస్ట్ గోదావరిపై విజయనగరం జట్టు గెలిచింది. వీరందరికి జిల్లా విద్యాశాఖధికారితో పాటు డిఎస్‌డిఒ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు.

క్రీడలకు ఆర్థిక సహాయం అందజేసిన దాతలు

రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ క్రీడలను ప్రోత్సహించేదుకు భోగాపురం గ్రామానికి చెందిన దాతలు ముందుకు వచ్చారు. భోగాపురం గ్రామానికి చెందిన కాకర్లపూడి శ్రీనివాసరాజు రూ.30వేలు, పోలిపల్లికి చెందిన బంగార్రాజు రూ.25వేలు విలువైన టీ షర్ట్‌లను రిఫరీలకు, వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు తదితరులకు అందజేశారు. అక్కివరం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు గొంపా శ్రీనివాస్ దంపతులు, గ్రామానికి చెందిన తగరపువలస కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ బి. నరసింగరావు, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు పల్లంట్ల జగదీష్, బొడ్డ హరిబాబు, రమణబాబు, పసుపులేటి లోకేష్, వరుపుల గిరి తదితరులు తమవంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీరికి డి.ఇ.ఒ, డిఎస్‌డిఒ చేతులు మీదుగా సన్మానించారు.

ఇతర శాఖల పనులు అప్పగించొద్దు

ప్రజాశక్తి - వేపాడ

విఆర్‌ఒలకు ఇతర శాఖల పనులు అప్పగించొద్దని కోరుతూ సోమవారం తహశీల్దార్ రాములమ్మకు విఆర్‌ఒలు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రస్తుతం నీటి సంఘం ఎన్నికలకు, సంబంధించిన ఓటర్ లిస్ట్‌లు తయారు చేయడం, మరో పక్క రీ సర్వే రెవెన్యూ గ్రామసభలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమం, జనరల్ ఓటర్ లిస్టు డోర్ టు డోర్ సర్వే, శని, ఆదివారం సెలవు రోజుల్లో స్పెషల్ క్యాంపన్ డేస్, బిఎల్ఒ విధులు, మూటేషన్స్ వివిధ రకమైన రెవెన్యూ విధులు నిర్వహిస్తూ పనిభారంతో ఇబ్బంది పడుతున్న తమపై పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కూడా రుద్దుతున్నారని విఆర్‌ఒలు కూడా సచివాలయ సిబ్బందితో కలిసి ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం 5 గంటలకు పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నామని చెప్పారు. రెగ్యులర్ రెవెన్యూ విధులలో భాగంగా క్యాస్ట్ ఇన్కమ్ సర్టిఫికెట్లు, ఎఫ్ఎంసీలు, కోర్టు వాయిదాలు, నీటి తీరువ డిమాండు తయారు చేస్తున్నామన్నారు. ప్రస్తుత విఆర్వోలు అనేక రకమైన రెవెన్యూ విధులు నిర్వహిస్తూ, రైస్ మిల్లులు దగ్గర కస్టోడియన్ ఆఫీసర్ గా, కొన్నిచోట్ల ఇసుక రీచ్‌ల వద్ద రాత్రిలు, పగలు, డ్యూటీలు, మరోపక్క కొన్ని జిల్లాల్లో జమాబంది రికార్డులు తయారు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. ఇలా అనేక రకమైన విధులతో సతమతమవుతుంటే, ఇప్పుడు ప్రతి సచివాలయంలో స్కిల్ డవలప్మెంట్ సర్వే చేయడానికి ఇతర శాఖల పనులు కూడా విఆర్‌ఒలను భాగస్వాములను చేస్తున్నారన్నారు. పై విషయమై తాము రాష్ట్ర సిసిఎల్ఎకు తెలియజేశామన్నారు. దీంతో వారు 2022లో ఒక సర్కిలర్‌ను పంపించారని ఆ సర్కిల్ ప్రకారం విఆర్‌ఒలకు ఇతర పనులు అప్పగించ వద్దని స్పష్టమైన ఆదేశాలున్నాయని, జిల్లా కలెక్టరు సిసిఎల్ ఇచ్చిన ఆదేశాలను కింద స్థాయిలో అమలు అయ్యేలా అన్ని శాఖలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

బొబ్బిలిరూరల్ : రెవెన్యూ శాఖలో పని చేస్తున్న విఆర్వోలకు పనిభారం తగ్గించాలని తహశీల్దార్ యం. శ్రీనుకు విఆర్ఒ సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు సింహచలం మాట్లాడుతూ విఆర్‌ఒలకు పనిభారం లేకుండా ఇతర శాఖల పనులు లేకుండా సిసిఎల్ఎ ఉత్తర్వులు ఇచ్చిందని కానీ ఆ ఉత్తర్వులు అమలు కావడంలేదని అన్నారు. ప్రసుతం నీటి సంఘాల ఓటరు లిస్టుల తయారీ, రీ సర్వే గ్రామసభలు, ఎమ్మెల్యేసి ఓటర్ల నమోదు, సాధారణ ఓటర్ల ఇంటిఇంటి సర్వే, మ్యుటేషన్లు, పెన్షన్ల పంపిణీ తదితర పనుల వల్ల ఒత్తిడికి గురవుతున్నామన్నారు. విఆర్‌ఒలకు పని భారం తగ్గించి సిసిఎల్ఎ ఉత్తర్వులు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు రవి, అప్పారావు, సిహెచ్ సుధాకర్, పి.శేఖర్, సత్యనారాయణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు

మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ప్రజాశక్తి- గజపతినగరం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని, ప్రశ్నించే గొంతును నొక్కుతుందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య విమర్శించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గడిచిన ఐదు నెలల పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేయలేకపోయిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను, మహిళలు, మైనర్ బాలికలపై జరుగుతున్న దాడులను, అగాత్యాలను సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేస్తున్నారని దుయ్యబట్టారు. వైసిపిని నిర్వీర్యం చేసే చర్యల్లో భాగంగానే కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పేరుతో అరెస్టులకు దిగుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, చంద్రబాబు నాయుడు పాలనపై పట్టు కోల్పోయారని, పాలన గాడి తప్పిందని అన్నారు. కూటమి భాగస్వామ్య పార్టీల భయంతోనే చంద్రబాబు పాలనను గాలికి వదిలేసారన్నారు. గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని, ఊరుకో బెల్ట్ షాప్ వెలిసిందని అన్నారు. బెల్ట్ షాపు పెడితే తోలు తీస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇప్పుడు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. నియోజవర్గంలో టిడిపి నాయకులు మద్యం సిండికేట్లు నడుపుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి గార తౌడు, ఎంపిపి సింహాద్రి అప్పలనాయుడు, మాజీ ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, మాజీ జెడ్‌పిటిసి మంత్రి అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, బెల్లాన త్రినాధ రావు, వైస్ ఎంపిపిలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్ నాయుడు, గోవింద, సోషల్ మీడియా ఇంచార్జ్ పి. ఎస్.ఎన్ మూర్తి పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

రేగిడి: కూటమి ప్రభుత్వం వాగ్దానం మేరకు తక్షణమే పెట్టుబడి సాయం అందించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నారు జనార్ధన రావు అన్నారు. ఈ మేరకు సోమవారం రైతు, కార్మికుల సమస్యలపై ఇంచార్జ్ తహశీల్దార్ చిన్నారావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి, పంటలు పండించిన రైతన్నలకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేల ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు.. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, వెంటనే నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వర్షపాతం తక్కువగా ఉండి, పంటలు దెబ్బతిన్న అన్ని జిల్లా, మండలాలను గుర్తించి వాటిని కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని తదితర డిమాండ్లు నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీరితో పాటు రైతులు సవిరిగాన సింహాచలం ఉన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సిఐ వేచలపు నారాయణమూర్తి హెచ్చరించారు. జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ ఆదేశాలతో సోమవారం ఎస్‌కోట పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ సిబ్బందితో కలసి ఆయన ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంవి నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు ఈ- చలానాలు విధించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ. ఎస్ కోట పోలీస్ స్టేషన్ పరిధిలో మైనరు డ్రైవింగు, ట్రిపుల్ డ్రైవింగు, సౌండు పొల్యూషను, డేంజరస్ డ్రైవింగు, డిఫెక్టివ్ నంబరు ప్లేట్లుపై ఎంవి నిబంధనలను అతిక్రమించి పట్టుబడిన వాహనాలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులకు పోలీసులు జరిమానా విధించారు. పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ సోమవారం వాహన తనిఖీలు చేశారు. వాహన నిబంధనలు పాటించని 60వాహనాలను సీజ్ చేసి అపరాధ రుసుం విధించి వాహనదారులకు పట్టణ సిఐ సతీష్ కుమార్ కౌన్సిలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు బీమాతో పాటు అనుమతి పత్రాలు ఉండాలన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మోటారు వాహన చట్టాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఇటీవల చట్ట నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేశారు. వారికి సోమవారం ఎస్ఐ ప్రసాదరావుతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై తనిఖీలు ముమ్మరం చేస్తున్నామన్నారు. వాహనదారులు రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలని వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు దగ్గర ఉంచు కోవాలని సూచించారు. హెల్మెట్, సీటు బెల్టు దరించాలన్నారు. పోలీసు, వాహన చట్ట నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా వాహనాలు పట్టివేత

నెల్లిమర్ల: గుర్ల మండల నుంచి నెల్లిమర్ల మీదుగా అలమండ వెళ్తున్న రెండు పశువుల తరలింపు వాహనాలను స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ఎస్ఐ బి. గణేష్ సోమవారం పట్టుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వాహన తనిఖీలు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుండగా వాహనాలను పట్టుకుని సీచ్ చేశారు. అనంతరం పలు వాహనాలను తనికీ చేసి ఇన్సూరెన్స్ లేని వాహనాలు ఐదు, రికార్డులు లేని వాహనాలు ఐదు, నెంబర్ ప్లేట్లు సరిగా లేని వాహనాలు 6, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నవి రెండు, మైనర్ డ్రైవింగ్ ఒకటి, ట్రిపుల్ రైడింగ్ ఒకటి, నంబర్ ప్లేట్ లేని వాహనం ఒకటి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పట్టుకున్నారు. వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించి భవిష్యత్తులో వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా అన్ని రికార్డ్స్ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలి

ప్రజాశక్తి - వంగర

రెవెన్యూ వ్యవస్థలో కింద స్థాయి ఉద్యోగులుగా పనిచేస్తున్న విఆర్‌ఎలకు తెలంగాణ మాదిరిగా పే స్కేలు అమలు చేయాలని విఆర్‌ఎల సంఘం నాయకులు యజ్జల అప్పలస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ డి ధర్మరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో తమ కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయని తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న విధంగా విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా విఆంఎలపై మోపిన నైట్ వాచ్మెన్, ఇసుక డ్యూటీలను రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. అర్హులైన విఆర్‌ఎలకు ప్రమోషన్లు కల్పించాలని, నామినీలకు విఆర్‌లగా గుర్తించాలని కోరారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న విజయవాడలో గల సిసిఎల్ఎ కార్యాలయం వద్ద జరుగు ధర్నాకు అనుమతి ఇప్పించాలని తహశీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల వివిధ గ్రామాలకు చెందిన విఆర్‌ఎలు పాల్గొన్నారు.

పాల రేటును పెంచాలని ధర్నా

ప్రజాశక్తి- మెంటాడ

పాల రేటును పెంచాలని కోరుతూ కౌలు రైతుల సంఘం అధ్వర్యంలో సోమవారం మెంటాడ విశాఖ పాల ఉత్పత్తి దారుల కేంద్రం వద్ద పాడి రైతులు ధర్నా చేశారు. ఈ సంధర్భంగా కౌలు రైతులనుద్దేశించి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ లీటర్ పాలపై రెండు రూపాయలు తగ్గించడం అమానుషమన్నారు. పెరుగుతున్న పాడి పశువుల మేత ఖర్చులు, పాడి రైతులు తట్టుకొనే పరిస్థితి కూడా లేని సమయంలో పాలు రేటును తగ్గించటం దారుణమన్నారు. పాడిరైతులకు 75శాతం రాయితీతో దాణాను పంపిణీ చేయాలని, పాడి పశువులకు ఉచిత బీమా సౌకర్యంతో పాటు చనిపోయిన పాడి రైతులకు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పాల కేంద్రాలలో పనిచేసిన సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే పాడిరైతులకు లీటర్‌కు పది రూపాయలు పెంచాలని కోరారు. ఈ నెల 29వతేదిన విశాఖపట్నం విశాఖ ప్రధాన డైరీ కేంద్రం వద్ద మహాధర్నా నిర్వహించే కార్యక్రమానికి ప్రతి పాడిరైతు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నేత రెడ్డి రాజప్పలనాయుడు, మెంటాడ, గుర్ల గ్రామాల మాజీ సర్పంచులు రాయిపిల్లి రవిశంకర్, గొర్లె సన్యాసిరావు, జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి గండ్రేటి అప్పలనాయుడు, గొర్లె ప్రకాశ్, పాండ్రంకి రామ్మూర్తి, సుంకరి త్రినాథ్, కనకయ్య రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై అధికారుల సర్వే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలో పలు గ్రామాల్లో తాగునీటి సరఫరాపై అధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. జెడ్‌పి సిఇఒ బి.వి.సత్య నారాయణ, ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు, ఇఒపిఆర్‌డి ఆయా గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసి పైప్ లైన్లు మురుగు కాలువకు దూరంగా ఉండడం, కాలువలో ఉన్నాయా, మరుగు దొడ్లు నుంచి నీటిని తరలించడానికి సోప్ పిట్లు అవకాశంపై సర్వే జరిపారు. దీనిలో భాగంగా కొత్తపేట, సీతారామునిపేట, గొర్లిపేట గ్రామాల్లో సర్వే నిర్వహించారు. సర్వే జరిపి జిల్లా కలెక్టర్‌కి నివేదిక అందిస్తామని వారు తెలిపారు.

బొబ్బిలిరూరల్ : గ్రామాలలో ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించాలని ఎపిడిఒ రవికుమార్ అన్నారు. సోమవారం పిరిడి, కమ్మవలస, జియెస్‌ఆర్‌పురం గ్రామాలలో ఐయెస్ఎల్, వాటర్ సప్లై వివరాల సర్వే తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన వల్ల

సర్వేను పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ

అనేక రోగాలు సంక్రమిస్తాయని ప్రతి ఇంటిలో మరుగు దొడ్డి ఉండాలని సూచించారు. సురక్షిత మైన తాగు నీటిని అందివ్వడం కోసం ప్రభుత్వం కోట్లలో ఖర్చు చేస్తుందని ఇంటిఇంటి కుళాయిలు ఏర్పాటు చేసుకొని తాగునీటి ని వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రవణ్ కుమార్, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, యంసిఒ సుధాకర్ పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో సోమవారం ఐహెచ్‌హెచ్ఎల్ ఇంటింటి సర్వే చేశారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి వాడుకొనే విధంగా అవగాహన చేస్తూ కాలువలలో ఎక్కడైనా పైప్‌లైన్లు ఉంటే ఎన్ని మీటర్లు ఎన్ని లొకేషన్‌లలో వున్నాయన్న వివరాలను ఉపముఖ్య కార్యనిర్వహనాధికారి వెంకటరామన్, ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్సులు, డెంకాడ, గునుపూరు, సచివాలయ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి : మండలంలోని దేవుపల్లి, కనిమెరక గ్రామాలలో జరుగుతున్న పారిశుధ్య సర్వేను డిపిఒ టి. వెంకటేశ్వరావు సోమవారం పరిశీలించారు. ఆయా గ్రామాలలో పారిశుద్యం, మరుగుదొడ్లు, తాగునీటి పైపుల నిర్వహణ వంటి ఇంటింటి సర్వే జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఇఒపిఆర్‌డి రఘుపతిరావు, గ్రామ కార్యదర్శి వి సత్యవతి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని నీలకంఠరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.అవతారం తెలిపారు. పాఠశాలకు చెందిన బి.యశ్వన్, ఎస్ జ్ఞాన ప్రసన్న అండర్ 14 విభాగంలో బాల్ బ్యాడ్మింటన్‌కు, సిహెచ్ వంశీ అండర్ 14 విభాగంలో త్రోబాల్‌కు, టి.లోకేష్ అండర్ 17లో బాస్కెట్ బాల్‌కు, పి.కుమార్, ఎల్. అంజలి, టీ.లోకేష్ అండర్ 19లో బాల్ బ్యాడ్మింటన్‌కు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్ వెంకటరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఎమ్.అవతారం, పాఠశాల సిబ్బంది, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు అభినందించారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో కెజిబివి ప్రతిభ

నెల్లిమర్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో కెజిబివి విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. ఈ పాఠశాలకు చెందిన కె.భారతి, కె. అలేఖ్య అండర్ -14 రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో టెన్ని కాయిట్‌లో రజిత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు యుఎస్ఎన్ మూర్తి, ఈపు విజయ్ కుమార్, కెజిబివి ప్రిన్సిపాల్ బి.ఉమా, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.

మండల స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ

రేగిడి: మండలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి క్విజ్ పోటీల్లో సంకిలి ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలోనూ రేగిడి ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానంలోనూ నిలిచాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శిరిడి సాయి నిర్వాహకులు బహుమతులు ప్రధానం చేశారు.

ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు సేవ కేంద్రం సిబ్బంది ఆర్గానిక్ ఉత్పత్తులు అమ్మకం చేపట్టారు. మండలంలో గల రైతుల దగ్గర నుంచి సేకరించిన ఆర్గానిక్ ఉత్పత్తులు ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద స్టాల్ ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తున్నట్లు రైతు సేవ కేంద్రం నిర్వాహకులు సిరపరపు రాము తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్గానిక్ ఉత్పత్తులు వాడకం ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఈ స్టాల్ ద్వారా కొర్రలు, రాగులు, ఊకలో, ఉలవలలు, పండ్లు కూరగాయలును ప్రతి సోమవారం ఇక్కడ విక్రయిస్తున్నామని పట్టణవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రామభద్రపురం: వ్యవసాయ పంటల సాగులో రైతులు ప్రకృతి ప్రసాదిస్తున్న వనరులతో పంటలు సాగుచేయడం వల్ల నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఎస్ఐ సూర్యలక్ష్మీ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం రసాయనిక ఎరువులు, పురుగు మందులు లేకుండా సాగుచేసిన కూరగాయలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు, పురుగు మందులతో సాగుచేయడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా భూసారం దెబ్బతింటుందని హెచ్చరించారు. పశువుల గెత్తం, ఎండిపోయిన ఆకుల ద్వారా వచ్చే ఎరువునే పంటలకు వాడడం వల్ల మానవులకు మంచి పౌష్టికాహారంతో పాటు ఆరోగ్యం సిద్ధించి, భూసారం దెబ్బతినకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటయ్య, ఎఎఒ కొండలరావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
EP 10/2016, OS 46/2012

Between :
Attada Suryanarayana ....DHR
And :
Gorle Yerrayya and others ......JDRs

Notice to

JDR 1) Gorle Yerrayya, S/o Late Surappadu, Yetha Street, Dasannapeta, Vizianagaram.
JDR 2) Gorle Simhachalam, S/o Yerrayya, Yetha Street, Dasannapeta, Vizianagaram.
JDR 3) Gorle Rama Rao, S/o Yerrayya, Yetha Street, Dasannapeta, Vizianagaram.

పైనెంబరు అమలులో అనేక సార్లు మీకు పై కోర్టు నుండి పంపినా మీరు తీసుకోనందున పై నెంబరు అమలు మీకు నోటీసు నిమిత్తం తే 2-12-2024దీకి వాయిదా వేసిరి. పై నెంబరు అమలులో మీకు ఎట్టి ఆక్షేపణలున్న ఎడల **తే 2-12-2024దీన ఉదయం 10-30గం॥**కు హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో పై అమలు మీ పరోక్షమందు తీర్మాణించబడును.

ఇట్లు
J.Bheemasena Rao
Advocate for DHR
Vizianagaram,
Cell: 9441053628

In the Honourable Court of the Senior Civil Judge, Vizianagarm
S.O.P. 8/2024

Between :
బొద్దుల సత్యవతి W/o లేటు సత్యనారాయణ, కుమరాం గ్రామ నివాసి, జామి మండలం, విజయనగరం జిల్లా.
.......పిటిషనరు
And :
1. Sena Dak Abhilekha Karyalaya, Army Postal Service Records, Pin 9440746 C/o 56 APO
2. 11 Inf Div Postal Unit, Pin 902211 C/o 56 APO
3. Army Recuruitment Office, Station Road, Visakhapatnam.
4. ADAGI (Insurence) Army Group Insurence Fund, AGI Bhavan, Rao Tula Ram Marg, PB No-14, Vasanthavihar, New Delhi - 110057.

.....Respondents

General Notice

ఇందలి పిటిషనర్ తన భర్త సత్యనారాయణ ఆర్మీలో ఉద్యోగం చేస్తూ కాలం చేసియున్నారు. అతనికి ఆర్మీ అధికార సంస్థ నుండి రావాలసిన సర్వీస్ బెనిఫిట్స్ ఈమెకు చెందాలని అతని వారసులగా ధృవీకరిస్తూ Succession Certificate ఇప్పించాలని పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినారు. ఇందలి రెస్పాండెంట్లు కాక, మరి ఎవ్వరికైనా ఎటువంటి ఆక్షేపణలు వున్న యడల, స్వయంగా గాని, మీ తరుపున లాయరు ద్వారా గాని పై కోర్టులో ఈ నెల **తే 19-11-2024దీ**న **ఉదయం 10-30గం॥**కు మీ హాజరు నిమిత్తం అయి ఉన్నది. లేనిచో పరోక్షంగా ఉన్న ఆధారాలు మేరకు మీ పరోక్షంగా పై కోర్టువారు తీర్పు చెప్పబడును అని ఇందుమూలంగా తెలియపరచడమైనది.

మండా కామేశ్వరరావు
పిటిషనరు తరుపు న్యాయవాది,
సెల్ : 9441013505